సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం। 25। ఆగస్టు। 2023

I



సాహితీవేత్త.. సంఘసంస్కర్త
తరిగొండ శ్రీ వెంగమాంబ ఓ సాహితీ వేత్త గానే కాకుండా అప్పటి సాంఘిక దురాచారాలను ధైర్యంగా ఎదిరించిన ధీరవనితగా నిలిచింది. -IIలో..



ఐదుగురికి యావజ్జీవ శిక్ష
దువ్వూరులో 2012లో స్థల వివాద విషయమై జరిగిన నేలటూరి బాలరంగన్న హత్య కేసులో ప్రొద్దుటూరు కోర్టు ఐదుగురు ముద్దాయిలకు యావజ్జీవ శిక్షను విధించింది. -IIలో..

గరిష్టం/కనిష్టం
34.8/26.9

వాతావరణం
జిల్లాలో గురువారం 26.9 – 34.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 11.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

26న మహా జాబ్‌మేళా

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల)లో ఈ నెల 26వ తేదీ మహా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రవీంద్రనాథ్ తెలిపారు. ఏపీ కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో 2022–23 విద్యా సంవత్సరం, అంతకుమునుపు డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఈ మేళాలో అపోలో ఫార్మసీ, అరబిందో ఫార్మాసూటికల్స్, దక్కన్ ఫైన్ కెమికల్స్, హెటిరో, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా, డిక్సన్ మ్యానుఫ్యాక్చరింగ్, ఎస్‌బీఐ పేమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర 60 కంపెనీలు పాల్గొంటాయన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల



లా సెమిస్టర్ ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, సీఈ తదితరులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని న్యాయవిద్య కళాశాలల్లో ఎల్ఎల్‌బీ (మూడేళ్లు, ఐదేళ్లు) ప్రథమ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. ఎల్ఎల్‌బి ఐదేళ్ల ఫలితాల్లో 57.28 శాతం, మూడేళ్ల సెమిస్టర్‌లో 63.06 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ పరీక్షలు జూలై నెలలో నిర్వహించగా, అతి తక్కువ కాలంలోనే ఫలితాలు విడుదల చేయడం పట్ల వీసీ పరీక్షల విభాగాన్ని అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, అదనపు పరీక్షల నిర్వహణ అధికారి డా. సుమిత్ర పాల్గొన్నారు.

ఆర్టీసీ విద్యుత్ బస్సు చార్జీలు తగ్గింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వం తిరుపతి రీజియన్ పరిధిలో నుంచి మూడు నగరాలకు విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా తిరుపతి–కడప మధ్య 12, తిరుపతి–నెల్లూరు 12, తిరుపతి–మదనపల్లె మధ్య 12 సర్వీసులను నడుపుతున్నారు. ఇందులో రూ. 40–50 వరకు చార్జీలను తగ్గించామని ఏపీఎస్ ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.భాస్కర్ తెలిపారు. తిరుపతి–నెల్లూరుకు రూ. 350 ఉండగా, రూ. 300, తిరుపతి–కడప రూ. 340 ఉండగా రూ. 290, తిరుపతి–మదనపల్లె రూ. 300 ఉండగా రూ. 260కు ఛార్జీగా తగ్గించడం జరిగిందన్నారు. తగ్గించిన ఛార్జీలు ఈనెల 26వ తేదీ అమలులోకి వస్తాయని ఆయన వివరించారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న మెడికల్ అండ్ హెల్త్ ఆర్డీ డాక్టర్ అనిల్‌కుమార్

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జీఓ 143 ప్రకారం ఉద్యోగుల రేషనలైజేషన్ (సర్దుబాటు) కౌన్సెలింగ్ చేపట్టారు. ఈ జీఓ ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులను చేపడుతున్న పీహెచ్ఎన్, హెచ్ఈ, ఎంపీహెచ్ఎస్ (ఎఫ్) కేడర్‌లకు చెందిన వారు ఇద్దరిలో ఒకరు మాత్రమే పనిచేయాలి. మరొకరిని ఖాళీగా ఉన్న పీహెచ్‌సీలకు సర్దుబాటు చేయాలి. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ అన్ని పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో ఉండడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం



రైతులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకటసుబ్బయ్య

బద్వేలు అర్బన్ : సాగులో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, నాణ్యమైన దిగుబడులను సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ప్రధానమంత్రి అనుసూచిత్ జాతీయ అభ్యుదయ యోజన ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూలు కులాల రైతులకు గురువారం వైఎస్సార్ జిల్లా బద్వేలు మార్కెట్‌యార్డు ఆవరణలో కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు విలువ చేసే మెటీరియల్, 23 రకాల విత్తనాలు అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈఓ కుముద, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, ప్రకృతి వ్యవసాయ జిల్లా యాంకర్ నాగసుబ్బరాయుడు, ఎన్‌జీవో మునెయ్య, రైతులు పాల్గొన్నారు.

వరుణుడి వైపు.. రైతుల చూపు

- గడువు ముగుస్తున్నా ముఖం చాటేసిన వరుణుడు
- జిల్లాలో జూన్, జులై, ఆగస్టులో తగ్గిన వర్షపాతం
- శ్రీశైలానికి వరద తగ్గడంతో కేసీ నీటి విడుదలపై సందిగ్ధత
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో వ్యవసాయ అధికారులు నిమగ్నం



సాగైన వేరుశనగ పంట

కడప అగ్రికల్చర్: ఖరీఫ్‌పైనే మెట్ట రైతులు ఆశలు పెట్టుకుంటారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా 27 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. మొక్కజొన్న పంట మినహా మిగతా పంటలు సాధారణ విస్తీర్ణంలో 50 శాతానికి మించలేదు. భూమిలో తేమ శాతం లేకపోవడంతో రైతులకు ఖరీఫ్ కలిసి రావడం లేదు. ముందుగా వేసిన అరకొర పంటలు ఎండ వేడిమికి నీరందక ఎండే పరిస్థితి. మరో నెల రోజుల్లో వరుణుడు కరుణించకపోతే ప్రత్యామ్నాయంపై రైతులు దృష్టి సారించాల్సిందే.

20 వేల హెక్టార్లలోనే సాగు

వైఎస్సార్ జిల్లాలో ఏటా అధిక విస్తీర్ణంలో పత్తి, వేరుశనగ పంటలు సాగు చేస్తారు. సాధారణ విస్తీర్ణం 77135 హెక్టార్లు ఉండగా, ఇప్పటి వరకు కేవలం 20,780 హెక్టార్లలో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. గత ఏడాది ఈ సమయానికి 2648 హెక్టార్లలో పంట సాగవగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 1894 హెక్టార్లలో మాత్రమే రైతులు విత్తనం విత్తుకున్నారు. అత్యధికంగా సాగు చేసే పత్తి పంట విస్తీర్ణం బాగా తగ్గింది. సాధారణ సాగు విస్తీర్ణం 21,567 హెక్టార్లు ఉండగా, గత ఏడాది 16,487 హెక్టార్లలో సాగు చేయగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 6887 హెక్టార్లు మాత్రమే సాగైంది. ముందస్తు జల్లులకు మొక్కజొన్న ఎక్కువగా సాగవగా, గత ఏడాది కంటే 16,955 హెక్టార్లలో పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది.

నీటి విడుదలపై సన్నగిల్లుతోన్న ఆశలు

తుంగభద్ర జలాశయం పై ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి అరకొరగా వరద నీరు వచ్చి చేరింది. నీరు చేరికతో కేసీ కాల్వకు విడుదల చేస్తారని రైతులు ఆశలు పెట్టుకున్నారు. అయితే గత కొద్ది రోజులుగా శ్రీశైలం జలాశయానికి వరద నీరు తగ్గిపోవడంతో నీటి విడుదలపై సందిగ్ధత నెలకొంది.

తగ్గిన వర్షపాతం

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదవుతోంది. మెట్ట ప్రాంతాల్లో అత్యధికంగా విత్తనం వేసుకునే జులై, ఆగస్టులోనూ వర్షం అంతంత మాత్రమే. ఈ ఖరీఫ్‌లో గడచిన మూడు నెలల్లోనే వర్షం కురవకపోవడంతో తేమ లేక రైతులకు విత్తనం వేసేందుకు అనుకూలించలేదు. మంచి వర్షాలు కురిస్తే ఆరు తడి పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. సకాలంలో వర్షం కురవకపోతే ప్రత్యామ్నాయ పంటలు సాగు వైపు రైతులను మళ్లించేందుకు అధికారులు దృష్టి సారించారు. మండలాల వారీగా నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో నమోదైన వర్షపాతం వివరాలు

నెల	సాధారణ వర్షపాతం	కురిసిన (మి.మీలలో)
జూన్	68.2	38.7
జులై	96.7	77.4
ఆగస్టు(ఇప్పటివరకు)	118.4	29.4

సాగు విస్తీర్ణం తగ్గింది...



జిల్లాలో వర్షాభావంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలసాగు విస్తీర్ణం తగ్గింది. ఖరీఫ్ ముగియడానికి ఇంకా నెల రోజులకు పైగా గడువు ఉంది. ఈ మధ్యలో మంచి వర్షం కురిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. పై ప్రాంతంలో అధిక వర్షాలు కురిసినా శ్రీశైలం ప్రాజెక్టుకు నీరు చేరి కేసీ కాల్వకు విడుదల చేసే అవకాశం ఉంటుంది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు మండలాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.
– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి.

జిల్లాలో ప్రధాన పంటల సాగు వివరాలు ఇలా..

పంట	సాధారణ సాగు	ప్రస్తుత సాగు	సాగు శాతం
మొక్కజొన్న	574	827	144.08
వరి	33215	6006	18.08
సజ్జలు	1027	244	23.74
కందులు	3453	1104	31.96
మినుము	1818	1395	78.76
వేరుశనగ	5740	1894	33.00
సన్‌ఫ్లవర్	1170	226	19.35
సోయాబీన్	863	406	47.04
పత్తి	21567	6887	31.93



తక్కువ విస్తీర్ణంలో సాగైన పత్తిపంట

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా సురేష్‌బాబు



కె.సురేష్ బాబు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా పార్టీ కమిటిని నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. జిల్లా అధ్యక్షుడిగా కొత్తమద్ది సురేష్ బాబు, ఉపాధ్యక్షులుగా గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి(కమలాపురం), డి. వెంకటశశికాంత్‌రెడ్డి(పులివెందుల), ప్రధాన కార్యదర్శులుగా దాసరి శివప్రసాద్(కడప), కిరణ్మయి(మైదుకూరు), బి. రామసుబ్బారెడ్డి(బద్వేల్), ఎస్. చెన్నకేశవరెడ్డి(ప్రొద్దుటూరు), కోశాధికారిగా ఎస్. హఫీజుల్లా(కడప), కార్యదర్శులుగా ఎం. హరిప్రసాద్‌రెడ్డి(జమ్మలమడుగు), ఇ. ఎద్దారెడ్డి(బద్వేల్), కె. మహేశ్వర్‌రెడ్డి, నారాయణమ్మ(కడప), ఇమామ్‌బాషా(మైదుకూరు), కె. దేవీ ప్రసాద్‌రెడ్డి(ప్రొద్దుటూరు), ఎస్. శివశంకర్‌రెడ్డి, జి. శ్రీనివాసరెడ్డి(కమలాపురం)లతోపాటు 31 మంది కార్యవర్గసభ్యులను నియమించారు.

కాచిగూడ-కొల్లాం మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఓనం పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు కాచిగూడ-కొల్లాం మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. కాచిగూడ-కొల్లాం (07044/45) రెండు ట్రిప్పులను నడపనున్నారు. ఈనెల 28న కాచిగూడలో సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి తెల్లవారుజామున 3.10 గంటలకు కడపకు, మరుసటిరోజు రాత్రి 11.30 గంటలకు కొల్లాంకు చేరుతుందన్నారు. తిరిగి కొల్లాంలో ఈనెల 30వ తేది సాయంత్రం 7 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.00 గంటలకు కడపకు చేరుకుని అర్ధరాత్రి 12.30 గంటలకు కాచిగూడకు చేరుతుందని వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- 7,996 మంది లబ్ధిదారులకు రూ.11.11 కోట్లు విడుదల
- బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేసిన సీఎం వైఎస్ జగన్



అతిథులతో కలిసి లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. అర్హులై ఉండి పలు కారణాలతో సంక్షేమ పథకాల లబ్ధి పొందలేకపోయిన వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసే 'బై యాన్యువల్ శాంక్షన్' కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీసీ ద్వారా బటన్ నొక్కి ప్రారంభించారు.

- సీఎం వీసీ ముగిసిన అనంతరం 7,996 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం విడుదల చేసిన రూ.11.11 కోట్లకు సంబంధించిన మెగా చెక్కును కలెక్టర్ అతిథులతో కలిసి అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ బై యాన్యువల్ శాంక్షన్ కార్యక్రమం కింద జిల్లాలో మొత్తం 7,996 మంది లబ్ధిదారులకు రూ.11,11,47,871లు విడుదలైందన్నారు.
- అమ్మఒడి కింద 798 మందికి రూ.1.19 కోట్లు, చేదోడు పథకం కింద 1,919 మందికి రూ.1.91 కోట్లు, ఈబీసీ నేస్తం కింద 509 మందికి రూ.76.39 లక్షలు, నేతన్న నేస్తం పథకం కింద 69 మందికి రూ.16.56 లక్షలు, సున్నా వడ్డీ పంట రుణాల కింద 916 మందికి రూ.1.12 కోట్లు, విద్యా దీవెన కింద 1,918 మందికి రూ.3.39 కోట్లు, వసతి దీవెన కింద 1,424 మందికి రూ.1.38 కోట్లు, మహిళా సంఘాలకు మూడు విడతల్లో 443 సంఘాల సభ్యులకు రూ.1.27 కోట్లు కలిపి అర్హులై ఉండి పలు కారణాలతో సంక్షేమ పథకాల లబ్ధి పొందలేకపోయిన వారికి ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్ కుమార్, మేయర్ సురేష్ బాబు, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ యానాదయ్య, పలువురు అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దేవుడిచ్చిన వరం



కొన్ని సాంకేతిక కారణాలతో 'జగనన్న విద్యా దీవెన– వసతి దీవెన' లబ్ధిని సకాలంలో అందుకోలేకపోయాను. బై యానువల్ శాంక్షన్ ద్వారా అందుకోవడంతో సంతోషంగా ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల విద్య కోసం చేస్తున్న సంస్కరణలు అభినందనీయం. చదువుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడే వారికి జగన్ సార్ అందిస్తున్న సాయం దేవుడిచ్చిన గొప్ప వరంగా భావిస్తున్నాం.
– జె.నరసింహ, ఆర్ట్స్ కళాశాల, కడప

ఏ సీఎం ఇంత గొప్ప పనిచేయలేదు



మాది మధ్య తరగతి కుటుంబం. చిన్నపాటి వ్యాపారంతో మా నాన్న కుటుంబ పోషణతోపాటు నన్ను చదివిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా దీవెన పథకం ఉండడంతో నా చదువు కోసం మా నాన్నకు ఏ మాత్రం ఆర్థిక భారం పడడం లేదు. మా కుటుంబ అర్హతలను బట్టి ప్రభుత్వ పథకాలు అందుతూనే ఉన్నాయి. భవిష్యత్తులో మళ్లీ జగన్ సారే ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నాను.
– మాహబూబ్ బాష, ఆర్ట్స్ కళాశాల, కడప

మహిళలకు పెద్దపీట



జగనన్న ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న వైఎస్ఆర్ ఆసరా పథకం మా జీవితాల్లో వెలుగులు నింపుతోంది. జగనన్న పాలన మహిళలకు నిజంగా స్వర్ణయుగం, పెండింగ్‌లో ఉన్న ఆసరా ఆర్థిక సాయం నా ఖాతాలో జమైంది. మా కుటుంబం అన్ని సంక్షేమ పథకాలు అందుకుంటోంది. ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.
– పద్మరేఖ, లక్ష్మీ ప్రసన్న ఎస్‌హెచ్‌జీ, కడప

గ్రామకంఠం భూములపై సర్వే

డీపీఓ ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి

కడప సెవెన్ రోడ్స్: రోవర్ ద్వారా నిర్వహించే గ్రామ కంఠం భూముల సర్వే విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ధనిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వమిత్వ' కార్యక్రమంపై జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో డీఎల్‌పీఓలు, 35 మండలాల ఈఓపీఆర్‌అండ్‌ఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ సర్వే ద్వారా గ్రామ కంఠం ఆస్తులను గుర్తించి వాటికి యాజమాన్య హక్కులు కల్పించడంతోపాటు ధ్రువ పత్రాలు అందిస్తారని తెలిపారు. సర్వేపై తొలిరోజు శిక్షణ ఉంటుందని, శుక్రవారం సీకే దిన్నె మండలం చెర్లోపల్లెలో ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహిస్తామని తెలిపారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంలో గ్రామ కంఠం భూముల సర్వే కూడా జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 726 రెవెన్యూ గ్రామాలుండగా 35 గ్రామాల్లో గ్రామ కంఠం సర్వే పూర్తి చేశామన్నారు. 159 గ్రామాల్లో సర్వే వివిధ దశల్లో ఉందన్నారు. గ్రామాల్లోని ఆస్తులకు సంబంధించి సర్వే నెంబరు, యజమాని పేరు, తండ్రి పేరు, విస్తీర్ణం, కొలతలు, సరిహద్దులు, తదితర అంశాలను నమోదు చేయాలని చెప్పారు. గ్రామ కంఠం సర్వే ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత అనుభవందారులకు హక్కు పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌బాబు, నరసింహులు, పుల్లారెడ్డి, శివప్రసాద్, అరుణ్‌కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



వీసీలో పాల్గొన్న జేసీ గణేష్‌కుమార్ తదితరులు

జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రాధాన్యత రంగాలకు సంబంధించి అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలను సమీక్షించారు. ఈ సమావేశానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్, డీఆర్వో గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత శాఖల జిల్లా అధికారులతో జేసీ మాట్లాడుతూ జిల్లాను అన్ని అంశాలలో ముందంజలో నిలిపేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే క్షేత్రస్థాయిలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రాధాన్యత భవన నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించేలా పనిచేయాలన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్వాడీ, వైఎస్సార్ వైఎస్సార్ క్లినిక్‌లు, తదితర ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలపై దృష్టిని సారించి వెంటనే పనులు పూర్తి చేసి ఆయా శాఖలకు అప్పగించాలని పంచాయతీరాజ్ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. నాడు– నేడులో భాగంగా జరుగుతున్న పనులను నిర్దేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఐదుగురికి యావజ్జీవ శిక్ష

– ఒక మహిళకు మూడేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా



హత్య కేసులోని ముద్దాయిలు

ప్రొద్దుటూరు క్రైం/దువ్వూరు : దువ్వూరులో 2012లో స్థల వివాద విషయమై జరిగిన నేలటూరి బాలరంగన్న హత్య కేసులో ప్రొద్దుటూరు కోర్టు ఐదుగురికి యావజ్జీవ శిక్షను విధించింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బాలరంగన్న, బుచ్చిరంగడు కుటుంబాల మధ్య 10 ఏళ్ల నుంచి 15 సెంట్ల స్థల విషయమై వివాదం నడుస్తుండేది. స్థలం కోసం వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో 2012 మార్చి 25న రాత్రి బాలరంగన్న కుమారుడు లక్ష్మీరంగడు ఇంటికి వెళ్తున్న సమయంలో బుచ్చిరంగడుతోపాటు కొందరు వ్యక్తులు అతనిపై దాడి చేశారు. ఇంటికి వెళ్లిన అతను ఈ విషయాన్ని బాలరంగన్నకు తెలిపాడు. దీంతో బాలరంగన్న సోదరులతో కలిసి బుచ్చిరంగడు ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ వారి మధ్య మాటకు మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో బుచ్చిరంగడుతోపాటు మరి కొందరు వ్యక్తులు కట్టెతో తలపై కొట్టడంతో బాలరంగన్నకు తీవ్ర రక్తస్రావమైంది. దీంతో అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యుడు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రంగనాథ్ ఫిర్యాదు మేరకు దువ్వూరు పోలీసులు క్రైం నంబర్ 44/12 కింద హత్య కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నేలటూరి బుచ్చిరంగడు, నేలటూరి రంగస్వామి, చంద్రకస్తూరి, చిలమకూరి ఆంజనేయులు, చిలమకూరి సుబ్బలక్షుమ్మ, చిలమకూరి పాలగండి, చిలంకూరి వెంకటసుబ్బయ్యలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ ప్రొద్దుటూరులోని సెకండ్ ఏడీజే కోర్టులో కొనసాగుతూ వచ్చింది. కేసు తుది విచారణలో భాగంగా నేరం రుజువు కావడంతో సెకండ్ ఏడీజే జడ్జి జీఎస్ రమేష్‌కుమార్ ఐదుగురికి యావజ్జీవ శిక్షతోపాటు రూ.2.30 లక్షలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు. చంద్రకస్తూరికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించారు. కేసు విచారణ సమయంలో ఏ 4 నిందితుడిగా ఉన్న చిలమకూరి అంజనేయులు మృతి చెందాడు. కాగా, మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్ పర్యవేక్షణలో మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కోర్టు మానిటరింగ్ సిబ్బంది నాగరాజు, బ్రహ్మయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎస్ఎం బాషా సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మొబీనాబేగం వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

సాహితీవేత్త.. సంఘసంస్కర్త

- భక్త కవయిత్రిగా వెంగమాంబ
- శ్రీ వెంకటేశ్వరుడ్ని భర్తగా కొలచిన మహాసాధ్వి
- నేడు తరిగొండలో జయంతి ఉత్సవాలు



వెంగమాంబ విగ్రహం



తరిగొండలోని వెంగమాంబ ఆలయం

గుర్రంకొండ : తిరుమలలోని శ్రీవారి సన్నిధిలో అన్నమయ్య మేలుకొలుపు– వెంగమాంబ జోలపాట, ముత్యాలహారతి అనే నానుడి భక్తుల్లో నాటుకుపోయింది. తెలుగుచరిత్రలో తొలి తెలుగు కవయిత్రి తరిగొండ శ్రీ వెంగమాంబ. ఆమె ప్రపంచానికి ఓ సాహితీ వేత్తగానే కాకుండా అప్పటి సాంఘిక దురాచారాలు, సనాతన ధర్మాలను ధైర్యంగా ఎదిరించిన ధీరవనితగా నిలిచింది. చరిత్రలో రాజారామ్‌మోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సాంఘిక సంస్కర్తల కంటే మునుపే అప్పట్లో సాంఘిక దురాచారాలను దీటుగా ఎదుర్కొంది. తరిగొండలో శుక్రవారం వెంగమాంబ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

17వ శతాబ్దంలో జననం

క్రీ.శ 17వ శతాబ్దంలో అప్పటి చిత్తూరు జిల్లా గుర్రంకొండ మండలంలోని తరిగొండలో నియోగి బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కానాడ కృష్ణమూర్తి, అచ్చమాంబ దంపతులకు వెంగమాంబ జన్మించింది. ప్రస్తుతం గుర్రంకొండ మండలం అన్నమయ్య జిల్లా పరిధిలోకి వచ్చిన విషయం తెలిసిందే. వెంగమాంబ బాల్యం నుంచే తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని తన భర్తగా భావించి నిరంతరం అద్వితీయమైన ధ్యానముద్రలో గడిపేది.

ఎన్నో రచనలకు శ్రీకారం

శ్రీ వెంకటేశ్వరస్వామిపై అనురక్తితో వెంగమాంబ అనేక రచనలకు శ్రీకారం చుట్టారు. తరిగొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని స్మరిస్తూ శ్రీ నరసింహ శతకాన్ని రచించింది. దీనికి నిదర్శనంగా ఇప్పటికీ తరిగొండలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోనే శ్రీ వెంగమాంబ ఆలయం కూడా ఉంది. శ్రీకృష్ణపారిజాతం, ముక్తకాంతావిలాసం, శ్రీ ముద్రరామాయణ ద్విపద కావ్యాలను రచించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మీద సుమారు రెండు వేల కీర్తనలను ఆ కాలంలో తాళ పత్రాలపై రచించింది. ఈ తాళపత్రాలు నేటికీ తిరుపతిలో టీటీడీ ఆధీనంలో ఉన్నాయి.

సాంఘిక దురాచాలను ధిక్కరించిన ధీరవనిత

క్రీ.శ 17,18 శతాబ్దాల్లో అప్పటి సమాజంలో సాంఘిక దురాచాలను కట్టుదిట్టంగా అమలు చేసేవారు. తిరుపతికి సమీపంలోని భాకరాపేటకు చెందిన ఇంజేటి వెంకటాచలపతితో వెంగమాంబ వివాహం జరిపించారు. అయితే దురదృష్టవశాత్తు భర్త ఆమె చిన్నతనంలోనే గతించారు. బ్రాహ్మణ సమాజంలో సనాతన సంప్రదాయాలు ఎక్కువగా పాటించే కాలం. బ్రాహ్మణ స్త్రీకి భర్త మరణిస్తే శిరోముండనం చేయించి బొట్టు, గాజు, మెట్టలు తొలగించి ఇంటిలోనే ఉంచేవారు. అయితే శ్రీనివాసుడ్నే తన భర్తగా భావించిన వెంగమాంబ ఈ సంప్రదాయలను తిరస్కరించింది. ఈమె ధోరణిని నిరసిస్తూ బ్రాహ్మణులంతా పుష్పగిరి అప్పటి పీఠాధిపతి విద్యానృసింహ భారతికి ఫిర్యాదు చేశారు.

గురుపీఠం దగ్ధం– శిరోజాలు యథాతథం

పుష్పగిరి పీఠాధిపతి తరిగొండకు చేరుకొని వెంగమాంబకు హితబోధ చేశారు. ఆమె తిరస్కరించడంతో అపరాధంగా భావించిన పెద్దలు పీఠాధిపతికి సాష్టాంగ నమస్కారం చేసి తప్పు సరిదిద్దుకోవాలని ఆదేశించారు. అయితే వెంగమాంబ పీఠాధిపతికి బదులుగా గురుపీఠానికి నమస్కారం చేయడంతో గురుపీఠం దగ్ధమైంది. ఆగ్రహించిన పెద్దలు ఆమెకు బలవంతంగా శిరోముండనం చేయించి తరిగొండ నరసింహస్వామి కొలనులో స్నానం చేయించారు. స్నానం చేసిన తరువాత వెంగమాంబ తలపై శిరోజాలు మునపటి లాగే దర్శనమిచ్చాయి. దీంతో వెంగమాంబకు గ్రామ బహిష్కారం విధించారు.

ఆంజనేయస్వామి గుహ నుంచే తిరుమలకు..

బ్రాహ్మణ పెద్దల ప్రవర్తనతో మనస్తాపం చెందిన వెంగమాంబకు శ్రీనివాసుడు తన వద్దకు చేరుకోవాలని సూచించి తిరుమలకు మార్గం కూడా చూపించారు. ప్రస్తుతం తరిగొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం వెనకవైపు ఉన్న సొరంగ మార్గం ద్వారా ఆమె తిరుమలకు చేరుకొంది. అక్కడ తుంబుర తీర్థంలోని శ్రీ వెంగమాంబ గుహగా పిలువబడే పర్వతశ్రేణిలో తన సాధనను కొనసాగించింది. అక్కడే కొన్ని రచనలు, కీర్తనలు రచించింది.

ముత్యాలహారతి.. వెంకటేశ్వరుడికి జోలపాట

తిరుమలలోనూ బ్రాహ్మణుల నుంచి ఆమెకు కష్టాలు ఎదురయ్యాయి. ఒకరోజు వెంగమాంబ గుహలో శ్రీనివాసుడు ప్రత్యక్షమై, అంతర్ధానం కావడం బ్రాహ్మణులు వీక్షించి వెంగమాంబ మహత్యాన్ని తెలుసుకొని తమ తప్పులు క్షమించాలని వేడుకొన్నారు. అప్పటి నుంచి కొండపైన అన్నమయ్య వారసులకు కల్పించిన సౌకర్యాలను ఈమెకు కల్పించారు. ఉండడానికి నివాసం, ఇతర సౌకర్యాలతోపాటు ఆలయంలో ఉదయం అన్నమయ్య మేలుకొలుపు తరువాత రాత్రి స్వామివారి జోలపాట ముత్యాలహారతి ఇచ్చే భాగ్యాన్ని వెంగమాంబకు కల్పించారు. అప్పటి నుంచి ఆమె తరువాత ఆమె వంశీకులు నేటికీ ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

నిత్యాన్నదానానికి శ్రీకారం

తిరుమలలో నేటికీ కొనసాగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది తరిగొండ శ్రీ వెంగమాంబే. క్రీ.శ 1812–15 మధ్య కాలంలో తిరుమలకు వచ్చే భక్తులకు వెంగమాంబ తన నివాసంలోనే భోజనాలు తయారు చేసి వడ్డించడం ప్రారంభించింది. వందలాది మంది భక్తుల ఆకలిని ప్రతి రోజూ తీర్చేది. టీటీడీ వారు నేటికీ ఆ సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా స్వామి వారి ఆలయానికి సమీపంలో ఉన్న నిత్యాన్నదాన సత్రానికి శ్రీ వెంగమాంబ పేరు పెట్టడం గమనార్హం

జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

మండలంలోని తరిగొండ ఆలయంతోపాటు తిరుమలలో శ్రీ వెంగమాంబ జయంతి ఉత్సవాలు జరుగుతాయి. తిరుమలలో గురువారం, తరిగొండలో మరుసటి రోజు నిర్వహించడం ఆనవాయిగా వస్తోంది. తరిగొండలోని వెంగమాంబ ఆలయంలో శుక్రవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక కార్యక్రమాలు, అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. సాయంకాలం కల్యాణోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. తిరుపతి శ్రీ వెంగమాంబ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ముస్లిం మతపెద్ద మురాషావలీ ఆశ్రయం

గ్రామ బహిష్కారానికి గురైన శ్రీ వెంగమాంబకు తరిగొండలో అప్పటి గొప్ప సూఫీమత బోధకుడు ముస్లీం మతగురువైన హజరత్ సయ్యద్ మురాద్‌షావలీ ఆశ్రయం కల్పించారు. కొద్ది రోజుల పాటు ఆయన వద్దనే గడిపింది. తరిగొండలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సమీపంలోనే ఈ మురాద్‌వలీ దర్గా (సమాధి) ఉంది. ఏటా ఇక్కడ వెంగమాంబ ఉత్సవాల కంటే మునుపే దర్గా ఉరుసు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం వెంగమాంబ తరిగొండకు సమీపంలోని మార్లెళ్ల గెవి(గుహ)కు చేరుకొంది. అయితే ప్రతి రోజు ఆమె సాధనకు అవసరమైన సాధనా సామగ్రి, కందమూలాను మురాద్‌షావలే సమకూర్చేవారు.



వెంగమాంబకు ఆశ్రయం కల్పించిన సయ్యద్ హాజరత్ మురాద్‌షావలీ దర్గా

రుక్సానా హత్య కేసులో ప్రధాన నిందితురాలి అరెస్ట్



షేక్‌అయిషా అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ, సీఐ

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన ప్రైవేట్ కాలేజీ అధ్యాపకురాలు రుక్సానా హత్య కేసులో ప్రధాన నిందితురాలు షేక్ అయిషా(26)ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మురళీకృష్ణతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. మదనపల్లె టౌన్ శివాజీనగర్‌కు చెందిన ఎస్.కే.ఖాదర్‌అహ్మద్ కుమారుడైన ఖదీర్‌అహ్మద్‌తో షేక్ అయిషాకు 2020 మార్చి 22న వివాహం జరిగింది. అయితే అప్పటికే ఖదీర్‌అహ్మద్‌కు పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన మహమ్మద్‌అలీ కుమార్తె పఠాన్ రుక్సానాతో 2017లో పెళ్లి జరిగిందని, భర్త తనను మోసం చేసి పెళ్లి చేసుకోవడంలో మొదటి భార్య రుక్సానా సహకరించిందని ఇద్దరిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. దీంతో భర్త ఖదీర్‌అహ్మద్ రెండో భార్య షేక్‌అయిషాకు దూరంగా ఉండటంతో పుట్టింటిలో ఒంటరిగా ఉండేదన్నారు. తాను భర్తకు దూరమయ్యేందుకు మొదటి భార్య రుక్సానా కారణమని భావించిన అయిషా తన అన్న షేక్‌ప్యారేజాన్, తమ్ముడు షేక్‌సులేమాన్, భర్త ఖదీర్‌అహ్మద్, బావ షబ్బీర్, తమ్ముడి స్నేహితులు షేక్‌అహ్మద్, షేక్ అయాజ్‌అహ్మద్, షేక్ ఇమ్రాన్ అలియాస్ మౌలా, అన్న స్నేహితులు షేక్‌జాఫర్‌బాషా, షేక్‌షారుఖ్, మేనమామ షేక్‌దాదాపీర్, బంధువు ఇర్ఫత్ తంజమ్ బేగంతో కలిసి హత్య చేసేందుకు పథకం రచించారన్నారు. రుక్సానా కదలికలను పసిగట్టి పథకం ప్రకారం ఆగస్టు 3వ తేదీన సాయంత్రం 5.30 గంటల సమయంలో ప్రశాంత్‌నగర్ సిద్ధార్థ కాలేజీరోడ్డు రఫీ కారు మెకానిక్ గ్యారేజీ వద్ద ఆయేషా తమ్ముడు సులేమాన్, స్నేహితుడు షేక్‌అహ్మద్‌లు కాపుకాచి మెడపై కత్తితో పొడిచి చంపారన్నారు. కుటుంబంలో ఇద్దరు భార్యలు భర్త కోసం గొడవలు పడటంతో హత్య జరిగిందన్నారు. హత్యలో ప్రధాన నిందితురాలైన షేక్ అయిషా కర్ణాటకలోని చింతామణి అగ్రహారలోని షేక్‌ఆరీఫ్ ఇంటిలో తలదాచుకుని ఉండగా, ప్రత్యేక బృందానికి వచ్చిన సమాచారం మేరకు అరెస్ట్ చేసి నేరంలో ఉపయోగించిన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ప్రాథమికంగా 12 మంది నిందితులుగా నిర్ధారణకు వచ్చామని, 11 మందిని అరెస్ట్ చేశామన్నారు. బంధువు ఇర్ఫత్ తంజమ్‌బేగంను అరెస్ట్ చేయాల్సి ఉందని, త్వరలోనే ఆమెను అరెస్ట్ చేసి చార్జ్‌షీట్ వేస్తామన్నారు. రుక్సానా హత్యకేసు విచారణలో ఉండగా, కొందరు కావాలనే జోక్యం చేసుకుని పోలీసులపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల ప్రకారం రుక్సానా హత్యకేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విచారణ చేస్తుంటే సంబంధం లేని వ్యక్తులు కేసును తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

చాపాడు : రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తున్నట్లు జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం జగనన్న రీ సర్వే, భూ హక్కు పథకం, గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి పరిహారంపై రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జగనన్న భూ హక్కు.. రీ సర్వే కార్యక్రమంలో భాగంగా రికార్డుల మేరకు రైతులకు భూ హక్కు కల్పించటం జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో రైతులకు చెందిన భూములపై జగనన్న రీ సర్వే చేపట్టి హక్కు కల్పిస్తూ రాళ్లను నాటిస్తున్నామన్నారు. రెవెన్యూ సిబ్బంది రైతులతో చర్చించి ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు అనుభంలో ఉన్న భూముల వివరాల రికార్డుల మేరకు హక్కు కల్పించటం జరుగుతుందని పేర్కొన్నారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా రైతుల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తామన్నారు.

రూ.30 కోట్ల భూ పరిహారం పంపిణీ

నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటి వరకూ రూ.30 కోట్ల మేరకూ పరిహారం పంపిణీ చేశామన్నారు. ఇంకా రూ.8 కోట్ల మేరకూ భూ పరిహారం పంపిణీ చేయాల్సి ఉందన్నారు. అయితే రైతులకు సంబంధించి భూముల వివరాలు చూపటంలో.. వారి నుంచి జాప్యం కలుగుతోందన్నారు. భూములు కోల్పోయే రైతులు తమ భూములకు సంబంధించి పత్రాలను సమర్పిస్తే అర్హత మేరకూ పరిహారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుభానీ, డిప్యూటీ తహసీల్దార్‌లు భవానీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సొమ్ములో చేతివాటం

– యానిమేటర్‌పై కేసు నమోదు

ముద్దనూరు : మండలంలోని యామవరం గ్రామ స్వయం సహాయక సంఘాలకు చెందిన స్త్రీనిధి, సీఐఎస్, ఉన్నతి, ఇతర నిధుల సొమ్ము రూ.16 లక్షల 4 వేల 350 స్వాహా చేశారు. అదే గ్రామానికి చెందిన వెలుగు యానిమేటర్ వీరబ్రహ్మం స్వాహా చేసినట్లు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌బాబు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. యామవరం స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యులు ప్రతి నెల వారు తీసుకున్న పలు రకాల రుణాల కంతుల సొమ్మును యానిమేటర్ వీరబ్రహ్మంకు చెల్లించారు. అయితే ఆయన బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకుని దుర్వినియోగం చేశారు. మొత్తం 13 సంఘాలలోని స్త్రీనిధి రూ.9,55,749, సీఐఎస్ రూ.1,77,706, ఉన్నతి నిధి రూ.1,87,976, జీతం అడ్వాన్సు కింద రూ.74,300తోపాటు ఇతర సొమ్ము మొత్తం 16,04,350 స్వాహా చేశాడు. ఎస్‌హెచ్‌జీ మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు యానిమేటర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొత్తమాధవరంలో చోరీ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్తమాధవరం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తమాధవరం గ్రామంలోని బ్రాందీ షాపు సమీపాన ఉన్న ఓ వీధిలో వెంకట సుబ్బయ్య ఇంటిలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. రూ.30 వేల నగదు, దాదాపు మూడు తులాల బంగారం అపహరించారు. అలాగే అదే రోజు రాత్రి అదే వీధిలో వలంటీర్‌గా పని చేస్తున్న మహేష్ ఇంటి ముందు ఉన్న కిరాణా షాపులో నూనె ప్యాకెట్లు, గోధుమపిండి ప్యాకెట్లు ఎత్తుకెళ్లారు. అదే వీధిలో ఉన్న పులిచర్ల చిన్నగిరి ఇంటిలో చోరీ చేస్తుండగా శబ్దాలు రావడంతో.. పక్క ఇళ్లలో ఉన్న కాలనీ వాసులు అరుపులు, కేకలు వేయడంతో పరారీ అయ్యారు. దీనికి సంబంధించి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను పిలిపించిన పోలీసులు వేలిముద్రలు, ఆనవాళ్లను సేకరించారు.

గాయపడిన యువకుడి మృతి



అశోక్ (ఫైల్)

మైదుకూరు : మైదుకూరు – ప్రొద్దుటూరు రహదారిలో ఈ నెల 19న కడప – కర్నూలు జాతీయ రహదారి బైపాస్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోర్ల అశోక్(24) గురువారం ఉదయం మృతి చెందాడు. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని కల్యాణ మండపంలో జరుగుతున్న వివాహానికి హాజరై, ప్రొద్దుటూరుకు చెందిన కోనేటి చంద్రనారాయణ, మైదుకూరుకు చెందిన గోర్ల అశోక్ అనే యువకులు కల్యాణ మండపం నుంచి ఇటీవల బైక్‌పై బైపాస్ బ్రిడ్జిపై వెళుతూ ముందు వెళుతున్న లారీని ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ సంఘటనలో కోనేటి చంద్రనారాయణ అక్కడికక్కడే మృతి చెందగా అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. అశోక్‌ను తొలుత ప్రొద్దుటూరు, ఆ తర్వాత కర్నూలు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. సంఘటనపై మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

వేంపల్లె : వేంపల్లె పట్టణ పరిధిలోని మదినాపురం కాలనీలో ఓ స్థల వివాద విషయమై ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మదినాపురం కాలనీలో వేంపల్లె పట్టణానికి చెందిన చిన్న ఖాసీంకు 1994లో ఇంటి స్థలం మంజూరైంది. అందులో ఇల్లు నిర్మాణం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం తన ఇంటి చుట్టూ రక్షణ గోడ నిర్మించుకునేందుకు హద్దులను ఏర్పాటు చేసుకున్నాడు. అయితే అక్కడ మదీనాపురం కాలనీకి చెందిన గుజిరి దర్బార్‌కు భూమి ఉన్నది. ఈ క్రమంలో తన భూమిలో నీవు సాగు చేసుకుంటున్నావని.. ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో పెద్ద మనుషులు పంచాయితీ చేసి ఇక్కడి వరకు ఇంటి స్థలం ఉందని హద్దులను ఏర్పాటు చేసి వెళ్లారు. ఆ తర్వాత ఇరు వర్గాల మధ్య మళ్లీ ఘర్షణ మొదలైంది. గుజిరి దర్బార్ కుమారుడు నాసర్ బాషా అనే వ్యక్తి ప్రత్యర్థులపై కత్తితో దాడికి దిగారు. దీంతో చిన్న ఖాసీం, ఉమర్ బాషా, మహమ్మద్ రఫీలకు కత్తిపోట్లు దిగాయి. అహ్మద్‌కు తోపులాటలో చేతికి గాయం అయ్యింది. అదే క్రమంలో చిన్న ఖాసీం వర్గీయులు రాళ్లు విసరడంతో గుజిరీ దర్బార్, రషీద్, హాసన్‌లకు స్వల్పగాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి గాయపడ్డ వారిని వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిన్న ఖాసీం, ఉమర్‌బాషాల పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి నిర్వీర్యం

సిద్దవటం : పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయిని సిద్దవటం మండలం ఏపీఎస్పీ 11వ బెటాలియన్ సమీపంలోని కొండ ప్రాంతంలో పోలీసులు గురువారం నిర్వీర్యం చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు పట్టుకున్న గంజాయిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ సమక్షంలో శాస్త్రీయ పద్ధతిలో దహనం చేశారు. కడప డీఎస్పీ షరీఫ్ ఆధ్వర్యంలో జిల్లా లోని పలువురు సీఐలు, ఎస్ఐలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న మినీ ఐచర్ వాహనం

– వ్యక్తి మృతి



ప్రభాకర్ (ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధి మంటపంపల్లె గ్రామ సమీపంలోని కడప–చెన్నై జాతీయ రహదారిపై గురువారం బైక్‌ను మినీ ఐచర్ వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మండలం ఉప్పుగుంటపల్లి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ ప్రభాకర్(45) నందలూరు మండలం కోనపురంలో ఉన్న తన పెద్ద కుమార్తె రేణుక వద్దకు బైక్‌పై బయలుదేరాడు. మంటపంపల్లె రైల్వే గేట్ సమీపాన ఉన్న జాతీయ రహదారి వద్దకు రాగానే రాజంపేట నుంచి కడప వైపు పోతున్న మినీ ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయం అయ్యింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాధితుడిని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. ప్రభాకర్‌కి ఇద్దరు కుమార్తెలు. రేణుకను నందలూరు మండలం కోనపురంలోని వ్యక్తికి, రెండవ కుమార్తె అనితను రైల్వేకోడూరు వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. ప్రభాకర్ భార్య పేరు సుశీల. ఈమె ప్రస్తుతం కువైట్‌లో ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడిన జింక మృతి

ములకలచెరువు : పీటీయం మండలం రంగసముద్రం వద్ద మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన కృష్ణ జింక గురువారం మృతి చెందినట్లు ఫారెస్టు బీటు అధికారి సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెటర్నరీ హాస్పిటల్‌లో జింకకు చికిత్స అందించి ములకలచెరువు సమీపంలోని దుసానివారిపల్లె వద్ద అడవిజంతువుల సంరక్షణ శిబిరంలో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. తీవ్రగాయాల కారణంగా జింక పరిస్థితి విషమించి మృతి చెందినట్లు చెప్పారు. పోస్టుమార్టం నిర్వహించి దగ్గరలోని కనుగొండ అడవిలో ఖననం చేసినట్లు వివరించారు.

తెలుగు సినిమా... ఎత్తర జెండా

సినిమా

అల్లు అర్జున్... ఉత్తమ నటుడు





హోల్‌సమ్ ఎంటర్‌టైనర్ ఆర్ఆర్ఆర్

- తెలుగు సినిమాకి పది అవార్డులు
- 'ఆర్ఆర్ఆర్'కు ఆరు అవార్డులు
- ఉత్తమ నటీమణులుగా ఆలియా భట్, కృతీ సనన్
- ఉత్తమ చిత్రంగా 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్'
- ఉత్తమ దర్శకుడు నిఖిల్ మహాజన్

జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తొలిసారి తెలుగు సినిమాలు దుమ్ము రేపాయి. మొత్తం పది అవార్డులతో 'ఎత్తర జెండా' అంటూ తెలుగు సినిమా సత్తా చాటింది. 69 ఏళ్ల జాతీయ అవార్డుల చరిత్రలో తెలుగు నుంచి జాతీయ ఉత్తమ నటుడిగా 'పుష్ప... ఫైర్' అంటూ అల్లు అర్జున్ రికార్డ్ సాధించారు. ఆస్కార్ అవార్డుతో చరిత్ర సృష్టించిన 'ఆర్ఆర్ఆర్' ఆరు అవార్డులతో సిక్సర్ కొట్టింది. వీటిలో 'హోల్‌సమ్ ఎంటర్‌టైనర్' అవార్డు 'ఆర్ఆర్ఆర్' సొంతం అయింది. 2021 జనవరి 1 నుంచి 2021 డిసెంబరు 31 లోపు సెన్సార్ అయి, అవార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న సినిమాలను పరిగణనలోకి తీసుకుని జ్యూరీ సభ్యులు అవార్డులను ప్రకటించడం జరిగింది. జాతీయ ఉత్తమ నటీమణులుగా 'గంగూబాయి కతియావాడి'లో వేశ్య పాత్ర చేసిన ఆలియా భట్, 'మిమి' చిత్రంలో గర్భవతిగా నటించిన కృతీ సనన్ నిలిచారు. ఖగోళ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా ఆర్. మాధవన్ టైటిల్ రోల్ చేసి, స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' ఉత్తమ చిత్రంగా, ఉత్తమ దర్శకుడిగా మరాఠీ ఫిల్మ్ 'గోదావరి'కి గాను నిఖిల్ మహాజన్ అవార్డు సాధించారు. ఇంకా పలు విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం గురువారం జాతీయ అవార్డులను ప్రకటించింది. ఆ విశేషాలు ఈ విధంగా...

69వ జాతీయ అవార్డులకు గాను 28 భాషలకు చెందిన 280 చలన చిత్రాలు పోటీపడ్డాయి. మొత్తం 31 విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. సుకుమార్ దర్శకత్వంలోని 'పుష్ప: ది రైజ్' సినిమాలోని నటనకు గాను అల్లు అర్జున్‌కు ఉత్తమ జాతీయ నటుడిగా తొలి అవార్డు లభించింది. ఇదే చిత్రానికి సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డు సాధించారు. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'రౌద్రం..రణం..రుధిరం' (ఆర్ఆర్ఆర్) సినిమాకు ఆరు విభాగాల్లో అవార్డులు దక్కాయి. జాతీయ హోల్‌సమ్ ఎంటర్‌టైనర్‌గా 'ఆర్ఆర్ఆర్' నిలిచింది. ఇదే చిత్రానికి ఉత్తమ నేపథ్య సంగీతానికి గాను ఎంఎం కీరవాణి, ఇదే చిత్రానికి స్పెషల్ ఎఫెక్ట్స్‌కి వి. శ్రీనివాస్ మోహనన్, 'నాటు నాటు..' పాట కొరియోగ్రఫీకి ప్రేమ్ రక్షిత్, 'ఆర్ఆర్ఆర్'లోని 'కొమురం భీముడో..' పాటకు మేల్ ప్లేబ్యాక్ సింగర్‌గా కాలభైరవ, ఇదే చిత్రానికి స్టంట్ కొరియోగ్రఫీకి కింగ్ సాల్మన్‌లకు జాతీయ అవార్డులు దక్కాయి. ఇక 'నాటు నాటు'కి రచయితగా తొలి ఆస్కార్ అవార్డు అందుకున్న చంద్రబోస్ 'కొండపొలం'లోని 'ధంధం ధం.. తిరిగేద్దాం...' పాటకు జాతీయ అవార్డు అందుకోనున్నారు. దర్శకుడిగా తన తొలి చిత్రానికి జాతీయ అవార్డు దక్కిన ఆనందంలో ఉన్నారు 'ఉప్పెన'ను తెరకెక్కించిన బుచ్చిబాబు సన. మైత్రీ మూవీ మేకర్స్‌పై వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించిన 'ఉప్పెన' ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచింది. ఉత్తమ సినీ విమర్శకుడిగా నల్గొండ జిల్లాకి చెందిన ఎం. పురుషోత్తమాచార్యులకు అవార్డు దక్కింది. రెండేళ్లుగా 'మిసిమి' మాస పత్రికలో సినిమా పాటల్లో శాస్త్రీయ సంగీతంపై పరిశోధనలు చేస్తూ, పలు వ్యాసాలు రాశారు పురుషోత్తమాచార్యులు. ఇక ఆలియా భట్‌కి 'గంగూబాయి కతియావాడి' జాతీయ ఉత్తమ నటిగా అవార్డు దక్కేలా చేయడంతో పాటు మరో నాలుగు విభాగాల్లో (బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్, మేకప్, ఎడిటింగ్) అవార్డులు వచ్చేలా చేసింది. అలాగే విక్కీ కౌశల్ హీరోగా నటించిన బయోగ్రాఫికల్ డ్రామా 'సర్దార్ ఉద్దమ్'కు ప్రాంతీయ ఉత్తమ హిందీ చిత్రంతో పాటు మొత్తం నాలుగు విభాగాల్లో (సినిమాటోగ్రఫీ, ఆడియోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్) అవార్డులు దక్కాయి. ఈ చిత్రానికి సూజిత్ సర్కార్ దర్శకుడు. తమిళ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కడైసీ వివసాయి', మలయాళంలో 'హోమ్', కన్నడంలో '777 చార్లీ' అవార్డులు గెలుచుకున్నాయి. ఇంకా పలు భాషల్లో పలు చిత్రాలకు అవార్డులు దక్కాయి.



విక్కీ కౌశల్ (సర్దార్ ఉద్ధమ్)



ఆలియా భట్ (గంగూబాయి కతియావాడి)



కృతీసనన్ (మిమీ)

69వ చలనచిత్ర జాతీయ అవార్డు విజేతలు

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప)
ఉత్తమ నటి: ఆలియా భట్ (గంగూబాయి..) – కృతీసనన్ (మిమీ)
ఉత్తమ చిత్రం: రాకెట్రీ: ద నంబి ఎఫెక్ట్ (హిందీ)
ఉత్తమ దర్శకుడు: నిఖిల్ మహాజన్ (గోదావరి- మరాఠీ సినిమా)
ఉత్తమ పిల్లల చిత్రం: గాంధీ అండ్ కో (గుజరాతీ)
ఉత్తమ మ్యూజిక్ డైరెక్టర్ (నేపథ్య సంగీతం): ఆర్ఆర్ఆర్ – ఎంఎం కీరవాణి
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): పుష్ప- దేవిశ్రీ ప్రసాద్
ఉత్తమ కొరియోగ్రఫీ: ఆర్ఆర్ఆర్ -ప్రేమ్ రక్షిత్
ఉత్తమ మేల్ ప్లేబ్యాక్ సింగర్: కాలభైరవ (ఆర్ఆర్ఆర్ – కొమురం భీముడో..)
ఉత్తమ లిరిక్స్: చంద్రబోస్- కొండపొలం
ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ అవార్డ్ (స్టంట్ కొరియోగ్రఫీ): ఆర్ఆర్ఆర్- కింగ్ సాల్మన్
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్: ఆర్ఆర్ఆర్- శ్రీనివాస్ మోహనన్
ఉత్తమ సహాయ నటి: పల్లవీ జోషి (ద కశ్మీరీ ఫైల్స్- హిందీ)
ఉత్తమ సహాయ నటుడు: పంకజ్ త్రిపాఠీ (మిమీ- హిందీ)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: ప్రీతిశీల్ సింగ్ డిసౌజా (గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఫీమేల్ ప్లేబ్యాక్ సింగర్: శ్రేయా ఘోషల్ (ఇరవిన్ నిఴల్- తమిళ్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: వీరా కపూర్ ఏ (సర్దార్ ఉద్ధమ్-హిందీ)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: ది మిత్రీ మాలిక్ – మాన్సి ధ్రువ్ మెహతా (సర్దార్ ఉద్ధమ్) (హిందీ)
ఉత్తమ ఎడిటింగ్: సంజయ్ లీలా భన్సాలీ (గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (లొకేషన్ సౌండ్ రికార్డిస్ట్): అరుణ్ అశోక్ – సోనూ కేపీ (చవిట్టు మూవీ-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే(అడాప్టెడ్): సంజయ్‌లీలా భన్సాలీ. ఉత్కర్షిణీ వశిష్ట (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): షాహీ కబీర్ (నాయట్టు సినిమా-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (డైలాగ్ రైటర్): ప్రకాశ్ కపాడియా – ఉత్కర్షిణీ వశిష్ట (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: అవిక్ ముఖోపాధ్యాయ్ (సర్దార్ ఉద్ధమ్ మూవీ-హిందీ)
ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్: భవిన్ రబరీ (ఛెల్లో షో - గుజరాతీ)
ఉత్తమ ఫిలిం ఆన్ ఎన్విరాన్‌మెంట్ కన్‌జర్వేషన్: అవషావ్యూహం (మలయాళం)
ఉత్తమ ఫిలిం ఆన్ సోషల్ ఇష్యూస్: అనునాద్–ద రెజోనెన్స్ (అస్సామీ)
ఉత్తమ పాపులర్ ఫిలిం ఆన్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్: ఆర్ఆర్ఆర్
ఉత్తమ ఆడియోగ్రఫీ (సౌండ్ డిజైనర్): అనీష్ బసు (జీలీ మూవీ- బెంగాలీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (రీ రికార్డిస్ట్ ఆఫ్ ద ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్): సినోయ్ జోసెఫ్ (సర్దార్ ఉద్ధమ్-హిందీ)
ఇందిరాగాంధీ అవార్డ్ ఫర్ బెస్ట్ డెబ్యూ ఫిలిం ఆఫ్ ఎ డైరెక్టర్: మెప్పాడియన్ (మలయాళం)
స్పెషల్ జ్యూరీ అవార్డ్: షేర్ షా (హిందీ) (డైరెక్టర్ విష్ణువర్ధన్)
నర్గీస్ దత్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్: ద కశ్మీరీ ఫైల్స్ (హిందీ)

ఉత్తమ ప్రాంతీయ చిత్రాలు

ఉత్తమ తెలుగు చిత్రం	: ఉప్పెన
ఉత్తమ తమిళ్ చిత్రం	: కడైసి వివసాయి (ద లాస్ట్ ఫార్మర్)
ఉత్తమ కన్నడ చిత్రం	: 777 చార్లి
ఉత్తమ మలయాళ చిత్రం	: హోమ్
ఉత్తమ హిందీ చిత్రం	: సర్దార్ ఉద్దామ్
ఉత్తమ గుజరాతీ చిత్రం	: లాస్ట్ ఫిల్మ్ షో (ఛెల్లో షో)
ఉత్తమ మరాఠీ చిత్రం	: ఏక్దా కే జాలా
ఉత్తమ మీషింగ్ చిత్రం	: బూంబా రైడ్
ఉత్తమ అస్సామీస్ చిత్రం	: అనూర్ (ఐస్ ఆన్ ది సన్ షైన్)
ఉత్తమ బెంగాలీ చిత్రం	: కల్కోకో-హౌస్ ఆఫ్ టైమ్
ఉత్తమ మైథిలీ చిత్రం	: సమాంతర్
ఉత్తమ ఒడియా చిత్రం	: ప్రతీక్ష్య (ద వెయిట్)
ఉత్తమ మెయిటిలాన్ చిత్రం	: ఈఖోయిగీ యమ్ (అవర్ హోమ్)

'పుష్ప' చిత్రంలో నటనకుగాను అల్లు అర్జున్‌కి జాతీయ ఉత్తమ నటుడు అవార్డు దక్కడం సంతోషం. తొలిసారి ఈ అవార్డు అందుకోనున్న అల్లు అర్జున్‌కి అభినందనలు. 69వ జాతీయ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమకు బొనాంజాగా నిలిచాయి. అదే విధంగా పాన్ ఇండియా కాన్వాస్‌లో దూసుకుపోతున్న 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి ఆరు విభాగాల్లో ఈ అవార్డులు దక్కటం ప్రశంసనీయం. డైరెక్టర్ రాజమౌళితో పాటు చిత్ర యూనిట్‌కి అభినందనలు. ఉత్తమ సంగీత దర్శకునిగా దేవీశ్రీ ప్రసాద్ (పుష్ప), ఉత్తమ సాహిత్యానికి చంద్రబోస్ (కొండపొలం) జాతీయ అవార్డుకు ఎంపికవడం అభినందనీయం.
- వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

***

తెలుగు సినిమా గర్వపడే క్షణాలివి. జాతీయ ఉత్తమ నటుడిగా నిలిచిన బన్నీ (అల్లు అర్జున్)కి శుభాకాంక్షలు. చాలా గర్వంగా ఉంది. రాజమౌళి విజన్‌లో ఆరు అవార్డులు సాధించిన 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు, రెండు అవార్డులు సాధించిన 'పుష్ప'కు, 'ఉప్పెన' టీమ్‌కు, సినీ విమర్శకులు పురుషోత్తమచార్యులకు శుభాకాంక్షలు. **- చిరంజీవి**

***

ఇట్స్ సిక్సర్.. జాతీయ అవార్డులు సాధించినందుకు 'ఆర్ఆర్ఆర్' యూనిట్ అందరికీ శుభాకాంక్షలు. ఎంపిక చేసిన జ్యూరీకి ధన్యవాదాలు. 'పుష్ప'.. తగ్గేదేలే... బన్నీకి, దేవిశ్రీ ప్రసాద్‌లతో పాటు 'పుష్ప' టీమ్‌కి శుభాకాంక్షలు. బోస్ (చంద్రబోస్) గారికి మళ్లీ శుభాకాంక్షలు. 'గంగూబాయి కతియావాడి'తో అవార్డు గెల్చుకున్న మా 'సీత' ('ఆర్ఆర్ఆర్'లో ఆలియా భట్ సీత పాత్రలో నటించారు)కు కంగ్రాట్స్. 'ఉప్పెన' టీమ్‌తో పాటు జాతీయ స్థాయిలో అవార్డులు గెల్చుకున్నవారికీ శుభాకాంక్షలు.
- రాజమౌళి

***

నా నేపథ్య సంగీతాన్ని గుర్తించి, నాకు జ్యూరీ సభ్యులు అవార్డును ప్రకటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. చంద్రబోస్‌గారికి, దేవిశ్రీ ప్రసాద్, కాలభైరవ.. మా 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు శుభాకాంక్షలు. **- కీరవాణి**

***


ఈ జాతీయ అవార్డు మీదే (సంజయ్ సార్, గంగూబాయి.. టీమ్.. ముఖ్యంగా ప్రేక్షకులు). ఎందుకంటే... మీరు లేకుంటే నాకు ఈ అవార్డు దక్కేదే కాదు. చాలా సంతోషంగా ఉంది. ఈ క్షణాలను గుర్తుపెట్టుకుంటాను. మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేసేందుకు ఇంకా కష్టపడతాను. 'మిమి' సినిమాలో నీ (కృతీ సనన్‌ని ఉద్దేశించి) నటన నిజాయితీగా, పవర్‌ఫుల్‌గా ఉంది. ఆ సినిమా చూసి నేను ఏడ్చాను. ఉత్తమ నటి అవార్డుకు నువ్వు అర్హురాలివి. **- ఆలియా భట్.**

***

69 సంవత్సరాలుగా తెలుగు ఇండస్ట్రీకి రాని ఆ అద్భుతాన్ని తీసుకొచ్చిన ప్రేక్షకులకు, నిర్మాతలకు, దర్శకుడికి, ముఖ్యంగా మా ఫ్యామిలీని పతాకస్థాయికి తీసుకుని వెళ్లిన మా అబ్బాయికి (అల్లు అర్జున్) కృతజ్ఞతలు. **- అల్లు అరవింద్**

ఇంకా వెంకటేశ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్ తదితరులు తమ ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్ఆర్ఆర్ సిక్సర్





కీరవాణి
శ్రీనివాస్ మోహనన్
కాలభైరవ
ప్రేమ్ రక్షిత్
కింగ్ సాల్మన్



దేవిశ్రీ ప్రసాద్



చంద్రబోస్



బుచ్చిబాబు



పురుషోత్తమాచార్యులు



కేక్ కట్ చేస్తున్న అల్లు అర్జున్‌తో కుటుంబ సభ్యులు, 'పుష్ప' టీమ్

మా మైత్రీ మూవీస్ బ్యానర్‌లో 'ఉప్పెన, పుష్ప' చాలా ప్రతిష్ఠాత్మక చిత్రాలు. జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడిగా అల్లు అర్జున్‌గారు చరిత్ర సృష్టించారు. తెలుగు సినిమా చరిత్రలో ఇది చిరకాలం గుర్తుండిపోతుంది. దేవిశ్రీ ప్రసాద్‌కి అవార్డు రావడం ఆనందంగా ఉంది. 'ఉప్పెన, పుష్ప' రెండు విజయాల్లో సింహ భాగం సుకుమార్‌గారిదే. 'ఆర్ఆర్ఆర్, కొండపొలం' చిత్రాలకు జాతీయ అవార్డులు రావడం ఆనందాన్నిచ్చింది.
- వై. రవిశంకర్, నిర్మాత

ఇదొక చరిత్ర
- నవీన్ యెర్నేని, వై. రవిశంకర్

అల్లు అర్జున్‌గారికి జాతీయ అవార్డు రావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఇదొక చరిత్ర 'పుష్ప' షూటింగ్ సమయంలోనే అల్లు అర్జున్ తప్పకుండా నేషనల్ అవార్డ్ కొడతారని సుకుమార్‌గారు అనేవారు.. అది ఈ రోజు నిజమైంది. మాకు ఇంత మంచి సినిమా ఇచ్చిన అల్లు అర్జున్, సుకుమార్ గార్లకు థ్యాంక్స్. దేవిశ్రీ ప్రసాద్‌కి జాతీయ అవార్డ్ రావడం హ్యాపీ. అలాగే మా 'ఉప్పెన'కి ఉత్తమ తెలుగు సినిమాగా జాతీయ అవార్డు రావడం గర్వంగా ఉంది. దర్శకుడు బుచ్చిబాబు, టీమ్‌కి అభినందనలు. అలాగే 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి ఆరు అవార్డులు రావడం సంతోషంగా ఉంది.
- నవీన్ యెర్నేని, నిర్మాత


''నా తొలి సినిమాకే జాతీయ అవార్డు రావడం హ్యాపీగా ఉంది. నిర్మాతలు నవీన్‌గారికి, రవిగారికి, మా గురువుగారు సుకుమార్ గారికి కృతజ్ఞతలు. సినిమా చూడ్డానికి మా ఇంట్లో నన్ను పంపించేవాళ్లు కాదు. అలాంటిది నేను ఒక సినిమాకి డైరెక్ట్ చేయడం, నా ఫస్ట్ సినిమాకే నేషనల్ అవార్డు రావడం అంటే ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదు. మా అమ్మగారికి నేషనల్ అవార్డు అంటే ఏంటో కూడా తెలియదు. ఈ అవార్డు గురించి ఆమెకి చెప్పాలంటే. 'ఇండియాలోనే పెద్ద అవార్డు వచ్చింది' అని చెప్పాలి'' అంటున్న బుచ్చిబాబు సనని తదుపరి చిత్రం గురించి అడగ్గా.. ''రామ్ చరణ్‌గారి కోసం మంచి రా అండ్ రస్టిక్ స్టోరీ రాశాను. నా మనసుకి బాగా నచ్చి, రాసుకున్న కథ ఇది. జనవరిలో షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు.
- బుచ్చిబాబు సన, దర్శకుడు

పది అవార్డులతో తొలి రికార్డ్

ఈసారి తెలుగు పరిశ్రమ ఎక్కువ జాతీయ అవార్డులు సొంతం చేసుకోవడంతో పాటు మరో విశేషమైన రికార్డ్ సాధించింది. అదేంటంటే.. 27వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'శంకరాభరణం' (1980) సినిమాకు నాలుగు జాతీయ అవార్డులు లభించాయి. 30వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'మేఘ సందేశం' (1982)కి నాలుగు అవార్డులు వచ్చాయి. అలాగే 'దాసి' (1988) చిత్రం 36వ జాతీయ అవార్డ్స్‌లో ఐదు విభాగాల్లో అవార్డులను దక్కించుకుంది. ఆ తర్వాత తెలుగు సినిమాలకు ఐదుకు మించి అవార్డులు రాలేదు. 35 ఏళ్లకు రెండు ఐదులు.. అంటే పది అవార్డులు దక్కించుకుని తెలుగు చిత్రసీమ తొలి రికార్డ్‌ని సాధించింది.

'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'

భారతదేశ ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త నంబి యార్ నారాయణన్ జీవిత చరిత్ర ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. ఇస్రోలో చేరిన నారాయణన్ స్వదేశీ రాకెట్లను అభివృద్ధి చేసే ప్రాజెక్ట్‌లో భాగంగా రష్యా డెవలప్ చేసిన క్రయోజెనిక్ ఇంజన్స్‌ని భారత్‌కి తీసుకురావాలనుకుంటారు. ఇదే సమయంలో పాకిస్తాన్‌కు భారత రాకెట్ సాంకేతిక విషయాలను చేరవేశారనే నెపంతో అరెస్ట్ అవుతారు నారాయణన్. అరెస్ట్ తర్వాత కేరళ పోలీసుల విచారణలో ఆయన ఎలాంటి చిత్రహింసలు అనుభవించారు? ఆ తర్వాత ఆయన జీవితం ఎలా మలుపు తిరిగింది? తనపై వచ్చిన తప్పుడు ఆరోపణల నుంచి నారాయణన్ ఎలా విముక్తి పొందారు? అనే నేపథ్యంలో 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. నంబియార్ నారాయణన్ పాత్ర చేయడంతో పాటు మాధవన్ దర్శకత్వం వహించారు. నారాయణన్ సతీమణి మీన క్యారెక్టర్‌లో హీరోయిన్ సిమ్రాన్ చక్కగా నటించారు. ప్రత్యేకించి ఆమె పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. హీరో సూర్య అతిథి పాత్రలో మెరవడం కూడా ఈ సినిమాకి ప్లస్ అయ్యింది. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది.



నా అభిప్రాయాన్ని బలంగా చెప్పాను - ఎంఎం శ్రీలేఖ

''ప్రతి ఏడాది తెలుగు సినిమాలంటే కొంచెం నిర్లక్ష్యం. కంటి తుడుపుగా ఒకటో రెండో అవార్డులు ఇస్తున్నారు. దీనిపై జ్యూరీలో గట్టిగా మాట్లాడే వారు కావాలి. తెలుగుకు ఎందుకు ఇవ్వరు? అని మాట్లాడ గలగాలి. అయితే ఆ సినిమాలో విషయం ఉండాలి.. లేకుంటే మాట్లాడలేం'' అన్నారు సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ. 69వ జాతీయ అవార్డుల్లో దక్షిణాది తరఫున జ్యూరీలో శ్రీలేఖతో పాటు రచయిత్రి బలభద్రపాత్రుని రమణి ఉన్నారు. అవార్డులు ప్రకటించిన అనంతరం ఎంఎం శ్రీలేఖ 'సాక్షి'తో మాట్లాడుతూ – ''మామూలుగా ఫైనల్ ప్యానల్‌లో భోజ్‌పురి వాళ్లు ఉంటారు. వారికి మహానటి సావిత్రి గురించి ఏం తెలుస్తుంది? అందుకే జ్యూరీలో ఉన్న తెలుగువారు తెలుగు సినిమాల గురించి గట్టిగా చెప్పాలి. ఓ జ్యూరీ సభ్యురాలిగా నా అభిప్రాయాన్ని నేను బలంగా చెప్పాను. ఈసారి నేను ఏవైతే రావాలనుకున్నానో దాదాపు వాటికే వచ్చాయి. తొలిసారి తండ్రీ కొడుకులు కీరవాణి అన్నయ్య- కాలభైరవ ఒకే వేదికపై అవార్డులు తీసుకోనుండటం నాకో గొప్ప అనుభూతి. ఇక జ్యూరీ సభ్యులకు ఒత్తిడి ఉంటుందనుకుంటారు.. అలాంటిదేమీ లేదు. నిజాయతీగా నాకు ఏది అనిపిస్తే అది చెప్పాను'' అన్నారు.



ఉప్పెన

మెగా ఫ్యామిలీ నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన హీరోల్లో వైష్ణవ్ తేజ్ ఒకరు. ఆయన నటించిన తొలి చిత్రం 'ఉప్పెన'. ఈ సినిమా ద్వారా బుచ్చిబాబు సన డైరెక్టర్‌గా, కృతీశెట్టి హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఈ ముగ్గురూ తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ అందుకున్నారు. సముద్ర తీరాన ఉప్పాడ అనే పల్లెటూరు. స్కూల్ డేస్ నుంచే బేబమ్మ (కృతీశెట్టి) మీద ఇష్టం పెంచుకున్న మత్స్యకార కుటుంబానికి చెందిన ఆశీర్వాదం (వైష్ణవ్ తేజ్) నిత్యం తననే ఆరాధిస్తూ ప్రేమిస్తుంటాడు. ప్రాణం కంటే పరువు ముఖ్యం అనుకునే పెద్ద మనిషి శేషారాయనం (విజయ్ సేతుపతి). ఆయన కూతురు బేబమ్మ కాలేజీలో చదువుకుంటూ ఉంటుంది. ఆ సమయంలో తన మనసులోని ప్రేమను బేబమ్మకి చెబుతాడు ఆశీర్వాదం. తన స్వచ్ఛమైన ప్రేమను అర్థం చేసుకున్న బేబమ్మ కూడా ఆశీర్వాదాన్ని ప్రేమిస్తుంది. ఇద్దరూ ప్రేమలో ఉన్న విషయం శేషారాయనంకి తెలుస్తుంది. దీంతో ఆశీర్వాదం-బేబమ్మ కలిసి ఊరి నుంచి వెళ్లిపోతారు. ఈ విషయం బయటకి తెలిస్తే తన పరువు పోతుందని ఆర్నెళ్ల పాటు తన కూతురు ఇంట్లోనే ఉందని ఊరి జనాలను నమ్మిస్తాడు రాయనం. ఆరు నెలల తర్వాత అయినా బేబమ్మ ఇంటికి తిరిగొచ్చిందా? తన కులం కానివాడు తన కూతురిని ప్రేమించాడన్న కోపంతో ఆశీర్వాదని శేషారాయనం ఏం చేశాడు? ఆశీర్వాదం-బేబమ్మ ప్రేమకథ ఎలాంటి మలుపు తీసుకుంటుంది? చివరికి వారిద్దరూ ఒక్కటయ్యారా ? లేదా అనేది 'ఉప్పెన' కథ. 2021 ఫిబ్రవరి 12న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది.

